ఆంధ్రజ్యోతి

3★



పెద్దపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 4 డిసెంబరు 2024

న్యూస్ బాక్స్

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన రైతులు

మంథని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500బోనస్ రైతులకు అందించడంపై హర్ష వ్యక్తం చేస్తూ సీనియర్ కాంగ్రెస్ నేత, రైతు గుండా రాజు ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా కన్నాల కెనాల్ పూడిత పనులు చేట్టి రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.

'అడ్లూరి'ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ధర్మారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి శాసన సభ్యుడిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలిచి మంగళవారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించారు. పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో లక్ష్మణ్ కుమార్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ ఎంపీపీ కడారి హన్మయ్య, పీఎస్ఎస్ మాజీ చైర్మన్ దేవి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం

మంథని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని కన్నాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఆరెల్లి సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని మిత్రులు సమాకూర్చిన రూ. 21 వేల ఆర్థిక సహాయాన్ని, సీ-5 కంపెనీలోని తోటి డ్రైవర్లు సమకూర్చిన రూ. 50వేలు మొత్తం 71 వేలను సతీష్ కూతరు నిత్యశ్రీ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో మంగళవారం భార్య నందినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్కుల సురేందర్‌రెడ్డి, గుడిసె గట్టయ్య, తేలక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



- సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల రాక
- సమస్యల పరిష్కారంపై చిగురిస్తున్న ఆశలు
- సభకు ముందే పలు అభివృద్ధి పనులు మంజూరు..
- నేడు పెద్దపల్లిలో యువ వికాసం సభ

తొలిసారిగా జిల్లాకు సీఎం



పెద్దపల్లిలో నిర్వహించే సీఎం సభకు సిద్ధం అవుతున్న సభా వేదిక

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సిరుల సింగరేణి.. వెలుగు జిలుగుల ఎన్టీపీసీ.. తెలంగాణకు వెలుగులు పంచే టీఎస్‌టీపీపీ.. రైతన్నకు దన్నుగా యూరియా అందిస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్.. రాముడు నడయాడిన రామగిరి ఖిల్లా.. అష్ట దిక్కుల్లో అష్ట లింగాలతో వెలసిన మంత్రపురి.. గోదావరి, మానేరు నదుల సంగమం.. రాష్ట్ర రాజధాని ప్రజల గొంతు తడుపుతూ, రైతంగానికి సాగు నీరందిస్తున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుగల జిల్లా పెద్దపల్లి.. తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి పెద్దపల్లికి వస్తున్న సందర్భంగా ఆయనపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్, పోతారం ఎత్తిపోతల పథకం, పెద్దపల్లి ఆర్టీసీ బస్‌డిపో, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తారని ఇప్పటికే మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. అయితే వీటితో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మానేరుపై ఓడేడు వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయడం, ఆరేళ్లుగా డిమాండ్ ఉన్న గర్రెపల్లి, గుంజపడుగు, కొలనూర్ మండలాల ఏర్పాటు చేయడం, రామగిరిఖిల్లా, రామునిగుండాలు, ఆదివరాహ స్వామి, మంథని పుణ్యక్షేత్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయడం, సింగరేణి కార్మికుల మారుపేర్ల డిమాండ్, ఆదాయ పన్ను మినహాయింపు, సొంతింటి కల, రామగుండంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి భూమి కేటాయింపు జరగడం లేదు. కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురవుతున భూములకు పరిహారం రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా పెండింగులో ఉన్న సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపుతారనే జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.





సభా వేదిక ముందు ఏర్పాటు చేసిన ర్యాంపు, రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన యువ వికాసం ప్లెక్సీ

● సభకు ముందే మంజూరు..

పెద్దపల్లిలో 4న సీఎం సభ జరగనున్న నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల ముందే పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దకల్వల నుంచి అప్పన్నపేట వరకు 12 కిలోమీటర్ల పొడవు సెంట్రల్ లైటింగ్‌తో 82 కోట్ల రూపాయలతో పెద్దపల్లి బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. పెద్దపల్లి ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ 51 కోట్లు, మంథనిలో గల 50 పడకల ఆసుపత్రి భవనానికి 22 కోట్లు, గుంజపడుగులో గల సబ్ సెంటర్‌ను పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తూ,

మిగతా 6వ పేజీలో

వేతనాల పెంపునకు కృషి చేయండి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించాలని సీఐటీయూ నాయకులు ఉల్లి మొగిలి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కు వినతి పత్రం అందజేశారు. భూమయ్య, రామన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత మండల ఎన్నికల అధికారుల నియామకం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల అధికారులను నియమిస్తూ మంగళవారం జిల్లా సభ్యత్వ కన్వీనర్ క్యాతం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ రిటర్నింగ్ అధికారిగా కాసిపేట శివాజీ, సహాయ కార్యదర్శిగా మహేందర్, లక్ష్మీనగర్ మండల రిటర్నింగ్ అధికారిగా దాసరి శ్రీనివాస్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా రాజ్‌కుమార్, అపర్ణ, ఫైటింక్లయిన్‌కాలనీ రిటర్నింగ్ అధికారిగా మేరుగు హన్మంతుగౌడ్, సహాయ రిటర్నింగ్ అధికారిగా కొండపర్తి సంజీవ్, సిలువేరు అంజి, తిలక్ నగర్ మండల అధికారిగా మహవాది రామన్న, ఐత పవన్, బొడ్డుపల్లి సంజీవ్, ఎన్‌టీపీసీ రిటర్నింగ్ అధికారిగా సుల్వ లక్ష్మీనర్సయ్య, సహాయ రిటర్నింగ్ అధికారులుగా చిరంజీవి, నర్సింగ్, అంతర్గాం మండల రిటర్నింగ్ అధికారిగా కోమళ్ల మహేష్, సహాయ రిటర్నింగ్ అధికారిగా కందుల సంతోష్, సిలివేరి కుమార్, పాలకుర్తి రిటర్నింగ్ అధికారిగా పిడుగు కృష్ణ, సహాయ రిటర్నింగ్ అధికారులుగా బోడకుంటి సుభాష్, మేరుగు నరేష్‌లను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 60,463 బీజేపీ సభ్యత్వం తీసుకున్నారని, రామగుండం అసెంబ్లీ పరిధిలో 23,471మంది తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు


సాగర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపల్లి గ్రామానికి చెందిన బోగె సాగర్(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్ స్నేహితుడైన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నపల్లికి చెందిన రాగుల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాగర్, శ్రీనివాస్ కలిసి మంచిర్యాల నుంచి కరీంనగర్ శివారులోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మొగ్ధుంపూర్ ప్రభుత్వ స్కూల్ వద్దకు రాగానే ఇటుకబట్టీకి చెందిన ఒక లారీ రోడ్డు క్రాస్ చేస్తుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సాగర్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందగా, శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్‌కు కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు సాగర్ మంచిర్యాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


చంద్రమౌళి (ఫైల్)

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో మంగళవారం ఉదయం విద్యుత్ షాక్‌తో పప్పు చంద్రమౌళి (53) మృతిచెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన చంద్రమౌళి గత మూడు రోజుల క్రితం భీమారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో నివాసం ఉంటున్న తన కూతురు ఇంటికి వచ్చాడు. మంగళవారం అల్లుడు రంజిత్ ఇంటి వద్ద కింద ఉన్న 20 ఫీట్ల ఇనుపరాడ్లను భవనంపైకి ఎక్కించేందుకు చంద్రమౌళి ఎదురింట్లో ఉన్న బాలుడు వంశీకృష్ణ సహాయం తీసుకున్నాడు. ఇద్దరు కలిసి ఇనుపరాడ్లను మెట్ల ద్వారా భవనంపైకి తీసుకువెళ్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ఇనుపరాడ్‌లు తగలడంతో విద్యుత్‌షాక్‌తో చంద్రమౌళికి తీవ్ర గాయాలు కాగా బాలుడు వంశీకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు చంద్రమౌళిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెం దాడు. బాలుడు వంశీకృష్ణ చేతులు, పొట్టకు గాయాలు కాగా స్థానికంగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. మృతుని అల్లుడు రామటెంకి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తన కూతురు, అల్లుడు, మనవరాలును చూడడానికి వెళ్లిన చంద్రమౌళి మృతిచెందడంతో కుటుంబీకులు, కాలనీవాసులు కన్నీరు మున్నీరుగా రోధించారు.

గంజాయి విక్రేతలపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పట్టణ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటకు చెందిన రంజిత్, పట్టణంలోని సుతారి పేటకు చెందిన సాయి కిరణ్, సందీప్ అనే ముగ్గురు వ్యక్తులు రాజీవ్ చౌక్ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై అనుమానస్పదంగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద 204 గ్రాముల గంజాయిని పట్టుకుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

పండుటాకులకు అండగా..

అందరూ ఉండి ఆదరణ కరువైన వారు కొందరు... ఎవరూ లేక నిరాశ్రయులైన వారు మరికొందరు.. అలాంటి వారిని అక్కున చేర్చుకుంటోంది వీర్లపల్లి గ్రామంలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం. సమాజంలో వృద్ధుల పట్ల జరుగుతున్న అమానవీయ సంఘటనలను చూసి చలించిపోయిన కొందరు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంకల్పంతో ఈ ఆశ్రమం ఏర్పాటయ్యింది. కన్నబిడ్డల నిర్లక్ష్యానికి గురవుతున్న పండుటాకులను చేరదీసి క(చ)ంటిపాపలా చూసుకుంటోంది.

● నిస్సహాయ వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న ఈశ్వర కృప వృద్ధాశ్రమం


వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన కొందరు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కళ్లముందు వృద్ధులకు జరుగుతున్న అన్యాయాలను చూసి చలించిపోయారు. నిస్సహాయ స్థితిలో బాధపడుతున్న వృద్ధుల కోసం అన్ని వసతులతో కూడిన ఓ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆ క్రమంలో వారంతా సీనియర్ సిటిజన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌గా ఏర్పడ్డారు. వారి ఆశయానికి వీర్లపల్లికి చెందిన సీతారాంరెడ్డి తోడయ్యారు. తన సొంత స్థలంలో అన్ని వసతులతో కూడిన వృద్ధాశ్రమాన్ని నిర్మించి ఇవ్వడంతో ఈశ్వర కృప వృద్ధాశ్రమం ఏర్పాటైంది. ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న ఈ ఆశ్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 26 మంది ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సొంత ఖర్చులతో మొదలైన ఆశ్రమ నిర్వహణ ప్రస్తుతం పలువురు దాతల సహకారంతో కొనసాగుతున్నది. ఆశ్రమంలోని వారికి పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు వారానికి రెండుసార్లు వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక సేవలందిస్తున్నారు. గీతా పారాయణం, టీవీ చూడటం, పత్రికలు చదవడం, యోగాలాంటి వ్యాపకాలతో వారిలో మానసికోల్లాసాన్ని నింపుతున్నారు.


ఆశ్రమంలో కూర్చొని మాట్లాడుకుంటున్న వృద్ధులు


ఆశ్రమంలో అన్నం తింటున్న వృద్ధులు

● అందరూ ఉన్నా.. అనాథను..



అయినవాళ్లందరు ఉన్నా.. అనాథగా ఉన్నాను. నా భర్త మరణించిన తరువాత నిస్సహాయ పరిస్థితుల్లో ఆశ్రమం అక్కున చేర్చుకుంది. ప్రస్తుతం ఆశ్రమంలో అన్ని వసతులతో ఆనందంగా ఉన్నాను.

- రాజేశ్వరి, పెద్దపల్లి

● నా అనేవాళ్లు లేరు..



నా భర్త 16 ఏళ్లక్రితం చనిపోయాడు. పిల్లలు లేరు. ఒంటరిగా ఉంటూ కూలిపనికి పోయేదాన్ని. వృద్ధాప్యం మీద పడడంతో ప్రస్తుతం కూలిపని చేసే పరిస్థితి లేదు. ఆశ్రమం అన్నం పెట్టి ఆదరిస్తోంది.

- భూదేవి, పెద్దపల్లి

● వృద్ధులకు ఆశ్రమం నిర్మించాలనే సంకల్పంతో..



వృద్ధుల కోసం ఆశ్రమం నిర్మించాలన్న సంకల్పంతో రిటైర్డ్ ఉద్యోగులం సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశాం. దాని ఆధ్వర్యంలో సభ్యుల నుంచి నిధులు సేకరించాం. ఆశ్రమం కోసం ప్రయత్నాలు చేస్తుండగా వీర్లపల్లిలో సీతారాంరెడ్డి తన సొంత స్థలంలో ఆశ్రమానికి అవసరమైన గదులు నిర్మించి ఇచ్చారు. గత ఏడాది మార్చి 24న ఈశ్వర కృప ఆశ్రమం ఏర్పాటైంది. అప్పటి నుంచి వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడే వారికి సేవలందిస్తున్నాం.

- పీటీస్వామి, అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్

కొండచిలువ పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని శాతవాహన విశ్వ విద్యాలయం ఆవరణలో మంగళవారం కొండ చిలువను కరీంనగర్ అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎస్‌యూ ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం క్రికెట్ నెట్‌లో చిక్కుకున్న కొండ చిలువను వాకర్స్ గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే కరీంనగర్ ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగారావు, సిబ్బందితో హుటాహుటిన అక్కడికి వెళ్లి స్నేక్ క్యాచర్ సన సహకారంతో నెట్‌లో చిక్కుకున్న కొండ చిలువను రక్షించారు. అనంతరం కొండ చిలువను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు..

ముగ్గురికి తీవ్ర గాయాలు

చందుర్తి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లిలో మంగళవారం రాత్రి రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీ కొట్టి వెళ్లడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దర్శనాల రామస్వామి తోపాటు భూక్య ప్రవీణ్, అజ్మీర తిరుపతి వేములవాడకు నుంచి బండపల్లి మీదుగా గర్జనపల్లికి వెళ్తున్నారు. బండపల్లిలో రోడ్డు పక్కన బైకును నిలిపి మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో బావుసాయిపేట నుంచి వేములవాడ వెళ్తున్న గుర్తుతెలియని కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామి, ప్రవీణ్, తిరుపతి గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం..

ఇద్దరి రిమాండ్

వేములవాడరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు వేమువాడ రూరల్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. గంగాధర మండలం ఉప్పర మల్యాలకు చెందిన బందరకంటి తిరుపతి, మంచిర్యాలలోని వికాస్‌నగర్‌కు చెందిన గుమ్మా జగన్నాథరావు వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన ఎడపల్లి స్వామికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. అతడి వద్ద 7,80,000 రూపాయలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారు. ఈ సంఘటనలో ఇద్దరిని రిమాండ్‌కి తరలించామని, హైదరాబాద్‌కు చెందిన పవన్‌రాజ్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు


మృతుడి దేహాన్ని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

వెల్గటూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలో ఆస్తి కోసం రక్తం పంచుకు పుట్టిన అన్నను చంపిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొమ్మెల భారతమ్మ శంకరయ్య దంపతులకు ఇద్దరు కుమారులు సుమన్(34), డిల్లేష్ ఉన్నారు. సుమన్ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమ్మరిపల్లి గ్రామంలో తల్లికి వారసత్వంగా వచ్చిన సుమారు 32 గుంటల భూమి ఉంది. రెండు నెలల క్రితం ఆ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుదారుడు బయానగా 2,60,000 రూపాయలు ఇచ్చాడు. బయానా డబ్బులు డిల్లేష్ ఒక్కడే వాడుకున్నాడు. ఆ డబ్బుల్లో తన వాటా తనకు ఇవ్వాలని అన్న సుమన్ తమ్ముడు డిల్లేష్‌ను అడిగాడు. ఈ విషయంపై తరచూ అన్నదమ్ముల మధ్య గొడవ జరుగుతోంది. 20 రోజుల క్రితం డిల్లేష్, అతని స్నేహితుడు సురేందర్ ఇద్దరు కలిసి సుమన్‌పై దాడి చేశారు. అప్పటి నుంచి అన్న సుమన్‌ను చంపితే ఆస్తి మొత్తం తనకే చెందుతుందని డిల్లేష్ భావించాడు. సోమవారం రాత్రి సుమన్ కిరాణం షాపునకు వెళ్లడం గమనించిన డిల్లేష్, అతని స్నేహితుడు సురేందర్ సహాయంతో దాడిచేసి కత్తితో దాడి చేసి హతమార్చాడు. హత్య అనంతరం ఇద్దరూ గుట్టుచప్పుడు కాకుండా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు.

షాపునకు వెళ్లిన సుమన్ ఎంతకీ ఇంటికీ రాక పోవడంతో తల్లి భారతమ్మ ఫోన్ చేసింది. ఫోన్ ఎంతకీ లేపకపోవడంతో గాలిస్తుండగా కిరాణం షాపు సమీపంలో సుమన్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ మృతుడి సోదరుడు డిల్లేష్ ఇంటికి వెళ్లడంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. డిల్లేష్ నేరం అంగీకరించాడని సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. మృతుడు సుమన్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

7న ఎస్‌యూలో మెగా జాబ్ మేళా

- శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్



మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 7న హెచ్‌ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 కంపెనీలతో ఐదు వేల ఖాళీల భర్తీకి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళా ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఐటీ, ఫార్మా, నర్సింగ్, హాస్పిటాలిటి, బ్యాంకింగ్, రిటైల్, మేనేజ్‌మేంట్ తదితర సెక్టార్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. బీటెక్, ఎంటెక్, ఆల్ గ్రాడ్యుయేట్స్, పీజీ, ఫార్మా, నర్సింగ్‌కు సంబంధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 2020-2025 వరకు చదివిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8121212873, 7337373575 నంబర్లలో సంప్రదించాలని వీసీ అన్నారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, ప్రొఫెసర్ మనోహర్, హెచ్‌ఆర్ కంపెనీ నిర్వాహకులు తాళ్లపెల్లి అశోక్ పాల్గొన్నారు.

నేడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

శాతవాహన యూనివర్సిటీలో విద్యార్థుల కోసం బుధవారం ఉదయం 10:30 గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నటు వీసీ ఉమేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇంగ్లీష్‌పై నైపుణ్యం పెంచేందుకు మూడు నెలల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వీసీ తెలిపారు.

భూసేకరణ గ్రామసభను బహిష్కరించిన రైతులు

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలికోట సూరమ్మ చెరువు కుడి కాలువ నిర్మాణం చేయడానికి భూసేకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రామసభను గోవిందారం రెవెన్యూ పరిధిలోని గోవిందారం, దేశాయిపేట, రాజ లింగంపేట రైతులు మంగళవారం బహిష్కరించారు. సంబంధిత రైతులతో తహసీల్దార్ రవికుమార్ మంగళవారం మధ్యాహ్నం భీమారం మండలంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. భూ నిర్వాసిత బాధితులందరు కలిసి భూసేకరణ నిలుపు దల చేసి తమకు న్యాయం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. భూసేకరణలో సన్న, చిన్నకారు రైతులము ఉన్నామని, తమ కుటుంబాలకు ఈ భూములే ఆధారమని అధికారులతో వారు పేర్కొన్నారు. ఈ భూమిని ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమన్నారు. అనంతరం తహసీల్దార్‌కు భూసేకరణ నిలుపుదల చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులు వినతి పత్రం సమర్పించారు.

థాయిలాండ్‌లో తప్పిపోయిన ఇద్దరు తెలంగాణవాసులు


ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అరవింద్, సాగర్ భార్యలు

జగిత్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్‌కు రెండు లక్షల రూపాయల చొప్పున చెల్లించి విజిట్ వీసాపై థాయిలాండ్‌కు వెళ్లిన ఇద్దరు తెలంగాణవాసులు కొన్ని రోజులుగా అక్కడ కనిపించడం లేదు. నిజామాబాద్ జిల్లా శెట్టిపల్లికి చెందిన శనిగారపు అరవింద్, జగిత్యా ల జిల్లా ఆత్మకూరుకు చెందిన కొండ సాగర్ గత నెల 11న ముంబాయి నుంచి థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌కు వెళ్లారు. ఆ తర్వాత 21 నుంచి వారు అందుబాటులో లేకుండాపోయారని, ఫోన్ చేస్తే కలువడం లేదని అరవింద్ భార్య జల, సాగర్ భార్య కాశమ్మ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారి వెంట కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకుడు వినోద్‌కుమార్, మంద భీంరెడ్డి ఉన్నారు. కాగా తప్పిపోయిన ఇద్దరి ఆచూకీ తెలుసుకుని ఏజెంట్‌పై పోలీస్ కేసు నమోదు చేయాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

జీడీకే 7ఎల్‌ఈపీలో హెడ్ ఓర్‌మ్యాన్ మృతి


సత్యనారాయణ(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా-2 పరిధి జీడీకే 7ఎల్‌ఈపీ గనిలో మంగళవారం ప్రమాద వశాత్తు హెడ్ ఓర్‌మ్యాన్ తీట్ల సత్యనారాయణ(45) మృతిచెందాడు. మూతపడిన 7ఎల్‌ఈపీ గనిలో ఇసుక నింపే పనులు జరుగుతున్నాయి. మంగళవారం మొదటి షిఫ్టు విధులకు వచ్చిన సత్యనారాయణ మరో జనరల్ మజ్దూర్‌తో కలిసి ఇసుక నింపే పనులను పర్యవేక్షిస్తున్న క్రమంలో మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఇసుకలో కూరుకుపోయాడు. జనరల్ మజ్దూర్ ఇచ్చిన సమాచారంతో రెస్క్యూ సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి సత్యనారాయణ మృతదేహాన్ని వెలికితీశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ గనికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ స్వగ్రామం జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


మృతదేహం వెలికితీసే పనుల్లో రెస్క్యూ టీం

అంగవైకల్యం ఉన్నా..

ఆత్మవిశ్వాసంతో ముందుకు

● కాళ్లు చచ్చుబడినా నాలుగు పట్టాలు

● బండలింగంపల్లి యువకుడు వెంకటేష్ ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్యం ఉన్నా ఆ యువకుడు ఏనాడూ బాధపడలేదు. నడవలేకపోయినా చేతులతో పాఠశాల వరకు వెళ్లి పాఠాలు నేర్చుకున్నాడు. అతడి ఆత్మవిశ్వాసం ముందు అంగవైకల్యం మోకరిల్లింది. చదువులో నాలుగు పట్టాలు పొంది అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ యువకుడు కుంట వెంకటేశ్ చిన్ననాటి నుంచి చదువంటే ప్రాణం. మూడేళ్ల ప్రాయం లోనే పోలియో బారిన పడడంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అమ్మనాన్నలు పడుతున్న కష్టాన్ని చూడలేని వెంకటేశ్ చదువుకోవాలని భావించాడు. శరీరం సహకరించకపోయినా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి, ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. చిన్నతనంలో తల్లిదండ్రులు భూదవ్వ-నాంపల్లి వెంకటేశ్‌కు పాఠశాల వరకు తీసుకెళ్లేవారు. చేతిలో డబ్బులు లేకపోయినా తల్లిదండ్రులు కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బుల్లో కొంత పుస్తకాలు, నోటు పుస్తకాలకు వెచ్చించేవారు. 2007-2009 వరకు మండలంలోని గొల్లపల్లిలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. కరీంనగర్‌లో డీఎడ్, అనంతరం అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో దూర విద్య ద్వారా డిగ్రీ చదివాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎడ్, ఎంఎడ్ చేయడంతోపాటు దూర విద్యలో ఎంఏ తెలుగు పూర్తి చేశాడు. ప్రస్తుతం ఎంఏలో సైకాలజీ చదువుతున్నాడు.


ప్రాక్టికల్‌లో భాగంగా వీల్‌చైర్‌లో పాఠాలను బోధిస్తున్న వెంకటేశ్

ప్రభుత్వ కొలువులకు దరఖాస్తు చేసుకున్నా కొద్ది పాటి వ్యత్యాసంతో ఉద్యోగం సాధించలేకపోయాడు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా చదువుతూనే ముందుకు సాగుతున్నాడు.


చదువుకుంటున్న వెంకటేశ్

చిన్నప్పటి నుంచి చదువంటే ఇష్టం

మాది నిరుపేద కుటుంబం. చిన్నతనం నుంచి చదువంటే ఇష్టం. అమ్మానాన్నలు పడుతున్న కష్టం చూడలేకపోయాను. ఉన్నత చదు వులు చదివి ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని నిర్ణయించుకున్నా. చిన్నతనంలో అమ్మానాన్నలు పాఠశాలకు తీసుకెళ్లి తీసుకొచ్చేవారు. ఉన్నత విద్యాభ్యాసంలో మిత్రులు సహకరించారు. చదువుకు అవస రమైన పుస్తకాలు సమకూర్చేవారు. ఉపాధ్యాయ కొలువు కొట్టాలనేది నా లక్ష్యం.

- కుంట వెంకటేశ్, యువకుడు

ఏడాది పాలనలో అనేక విజయాలు సాధించాం..

● నేడు పెద్దపల్లిలో సీఎం సభ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన ● పత్తిపాక రిజర్వాయర్, పెద్దపల్లి బస్ డిపోపై ప్రకటన ● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


పెద్దపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చిత్రంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి తదితరులు

పెద్దపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేశాం.. ఎన్నో విజయాలు సాధించాం.. చేసేది ఉంది.. ఇంకా చేసి చూపిస్తాం.. అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 4న పెద్దపల్లిలో యువ వికాసం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు వివిధ శాఖల మంత్రులు బహిరంగ సభలో పాల్గొననున్నారని తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఈప్రాంత రైతుల చిరకాల వాంఛ అయిన పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేస్తారని, ప్రాజెక్టు సర్వే కోసం నిధులు కేటాయించనున్నారని అన్నారు. పెద్దపల్లి ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు ప్రకటన కూడా చేయనున్నారని తెలిపారు. పెద్దపల్లి బైపాస్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన, జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో స్వశక్తి మహిళా ప్రాంగణం భవనం, రూ.5 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో గ్రంథాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో రూ. 60కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు, మంథనిలో ఆర్‌అండ్‌బీ పెండింగ్ రోడ్ల పూర్తికి శంకుస్థాపనలు చేస్తారన్నారు. రూ. 10 కోట్లతో అంతర్గాంలో, మంథని గంగపురిలో, పోతారంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. అంతర్గాం మండలం రామగుండం, బండ్లవాగు లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పూర్తికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం మున్సిపాలిటీల పరిధిలో రూ.51 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించనున్నట్లు వివరించారు. రూ.80 కోట్లతో ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద మానేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని, రూ.25 కోట్లతో కాల్వశ్రీరాంపూర్ నుంచి మొట్లపల్లి రోడ్డు, రూ.25 కోట్లతో పీడబ్ల్యూడీ రోడ్ నుంచి ఎల్లంపల్లి వరకు రోడ్ల నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు. రూ.6 కోట్లతో గర్రెపల్లి నుంచి ఎలిగేడు వరకు రహదారి విస్తరణ, రూ.5 కోట్లతో హుస్సేన్‌మియా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి, రూ.12 కోట్లతో సుగ్లాంపల్లి నుంచి ధూళికట్ట వరకు రహదారి విస్తరణ పనులకు సీఎం శంకుస్థాపన చెస్తారని మంత్రి తెలిపారు. రామగుండంలో రూ.60కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, మంథనిలో బ్రిడ్జి, రోడ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారని మంత్రి పేర్కొన్నారు. మంథని ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ పనులకు శంకుస్థాపన చేస్తారని, గుంజపడుగులో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం, పెద్దపల్లి 50 పడకల ఆస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులను సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లతో పాటు ఎలిగే డులో పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేస్తారని తెలి పారు. పెద్దపల్లి అలాగే ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. 21వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. జిల్లాలో 60,619 మంది రైతులకు రుణమాఫీ జరి గిందన్నారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వ డంవల్ల కౌలు రైతులకు కూడా లాభం జరిగింద న్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ తరుగు లేకుండా చేపట్టామని, బీఆర్ఎస్ హయాంలో క్వింటాలుకు 8 నుంచి 10 కిలోల తరుగు తీశారన్నారు. తాము ఇంత చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు ప్రభుత్వా న్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. సీఎం సభ లో 9వేల మంది గ్రూపు-4, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు ముఖ్యమంత్రి అందించనున్నారని తెలిపారు. సీఎం సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో రైతులు, యువత, మహిళలు, అన్నివర్గాల ప్రజలు తర లివచ్చి విజయవంతం చేయాలని మంత్రి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్ సింగ్, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, మాజీ విప్ ఆరెపల్లి మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాశ్‌రావు,నాయకులు గోపగాని సారయ్యగౌడ్, ఊట్ల వరప్రసాద్, బుషనవేని సురేశ్ గౌడ్, బండారి రామ్మూర్తి, నూగిళ్ల మల్లయ్య, మస్రత్, సర్వర్‌పాషా, తాడూరి శ్రీకళ శ్రీమాన్, సాంబి రెడ్డి, బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- రామగుండం సీపీ శ్రీనివాస్


సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ, సీపీ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో బుధవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి రంగంపల్లిలోని వెంకటపద్మ ఫంక్షన్ హాల్లో బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి భద్రతారమైన సూచనలు చేశామన్నారు. మొత్తం 200మంది పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏడుగురు ఎస్పీలు, అదనపు ఎస్పీలు 3, డీఎస్పీ/ఏసీపీలు 15, సీఐలు 48, ఎస్సైలు 124, మహిళా ఎస్ఐలు 15, ఏఎస్సై/హెడ్ కానిస్టేబుళ్ళులు 316, కానిస్టేబుళ్లు 846, హోంగార్డ్సు 384 మంది, క్యూఆర్టీ మెంబెర్స్ 70, 10 స్పెషల్ పార్టీలతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్, పబ్లిక్ మీటింగ్, శిలాఫలకాల ప్రారంభోత్సవాల, రూఫ్‌టాప్, పబ్లిక్ మీటింగ్, డయాస్, పార్కింగ్ ప్రాంతాల వద్ద ఉండే పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు బందోబస్తును సెక్టార్లుగా విభజించి డీఎస్పీ/ఏసీపీలు ఇన్‌చార్జీలుగా భారీ బందోబస్తును ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. రోప్‌పార్టీలు, రోడ్ ఓపెనింగ్‌పార్టీలు, పెట్రోలింగ్ పార్టీలు, ట్రాఫిక్ డైవర్షన్, పికెటింగ్, బిడి టీమ్స్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వర్తించే సమయంలో సంయమనం పాటించాలని, పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ సెక్టార్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు..

● సభాస్థలిని పరిశీలించిన మల్టీజోన్ ఐజీ

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మల్టీజోన్ ఐజీ-1 చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. సభాప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్వహణ, వివిపీ ప్రాంతాల సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు పరిశీలించారు. వివిపీల కోసం ప్రత్యేక ప్రవేశ ద్వారాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారులు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రాంతాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్నిఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచనలు జారీ చేశారు.

సీఎంకు వినతిపత్రం ఇచ్చే అవకాశం కల్పించాలి..

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఉమ్మడి జిల్లా ఇంచార్జి అక్కెనపల్లి కరుణాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జేఏసీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కన్నవెన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొండా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా నూనె కుమార్, కార్యదర్శిగా కొండవెన ఓదెలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులు చెల్లించే విషయంలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేస్తూ, సర్పంచుల ఉద్యమాన్ని అణచివేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి పెద్దపల్లి పర్యటనలో సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ అంజయ్య, సలహాదారులు కిందే గంగాధర్, జిల్లా కార్యదర్శి ఉన్నల లక్ష్మణ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మహేందర్, ఎరుకల రవి, నీలం శ్రీనివాస్, తాటికొండ శంకర్, కరెంగుల సుధాకర్, కనవేన కొమురయ్య, రొడ్డ శ్రీనివాస్, ఎర్రం సదానందం, గాదం శ్రీనివాస్, సిద్ధ రాజయ్య, అలుగువెళ్లి వీరారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

కమాన్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. మంగళవారం మండల స్థాయి అఖిల భారత విద్యార్థి సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే ఫీజు బకాయిలను, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల పరిస్థితి తీవ్రంగా ఉందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల నూతన అధ్యక్షుడిగా రఘు, కార్యదర్శిగా ధనుష్, ఉపాధ్యక్షులుగా పిట్టల సంజయ్, సహాయ కార్యదర్శులుగా సాయిచరణ్, కోశాదికారిగా సిద్దేశ్వర్, గర్ల్స్ కన్వీనర్‌గా చొప్పరి వైష్ణవి, పున్నం అక్షయ, కౌన్సిల్ సభ్యులుగా దండే రిషిత, శార్వాణి, ప్రత్యూష, వైశాలి, ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.

రామగిరిఖిల్లా అభివృద్ధికి సీఎం చొరవ చూపాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామగిరి ఖిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవచూపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టెముక్కుల సురేష్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభలో రామగిరిఖిల్లా అభివృద్ధికి ప్రకటన చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వయాన శ్రీరామ చంద్రుడు సీతాసమేతంగా అక్కడ నడయాడిన ఆనవాళ్ళు ఉన్నాయని, రాములవారు స్వయంభుగా వెలిశారనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రపంచ శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యచకితులను చేసే వనమూలికలు రామగిరి ఖిల్లా సొంతమన్నారు. ఆలయాలు, పర్యాటక అభివృద్ధికి రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు కేటాయించిందని సురేష్‌రెడ్డి తెలిపారు. రామగిరిఖిలా అభివృద్ధి చెందితే జిల్లాకు అంతర్జాతీయంగా మంచిపేరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళలు ఆర్థికశక్తిగా ఎదగడానికి ప్రోత్సాహం..

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమా-సురేష్‌రెడ్డి

మంథని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలంతా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక శక్తిగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా శక్తి పథకం ద్వారా అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి శ్రీధర్‌బాబు సన్మానించారు. మెప్మా ఆధ్వర్యంలో 18 మహిళా సంఘాలకు మంజూరైన రూ.2.40కోట్లు, చిరువ్యాపారుల కోసం పీఎంఎం స్వనిధి ద్వారా 20 మందికి మంజూరైన రూ.2.30 లక్షల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. స్థానిక గాంధీచౌక్ ఏరియాలో మహిళలు ఏర్పాటు చేసుకున్న పలు షాపులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వారిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటానికి విధానాలను రూపొందిస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, చిరు వ్యాపారాల్లో మహిళలు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమా-సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

కాంగ్రెస్ నేత ఉప్పట్ల శ్రీను, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ శ్రీరాంభట్ల సంతోషిని కుటుంబాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. శ్రీనివాస్ సోదరుడు శ్రీరాంభట్ల సంతోష్ ఇటీవల మృతిచెందగా మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం..

- మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి). జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్య బీమా, ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ, ప్రెస్‌భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను పెద్దపల్లిలో జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రభుత్వం జర్నలిస్టులకు న్యాయం చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేస్తోందని తెలిపారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఖైదంబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బియ్యని రాజబాబు తండ్రి మరణించాడు. జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ సర్పంచ్ తూటి రజిత రఫీ, బక్కతట్ల వినీత్, గాదం శ్రీనివాస్, కోల విజయ్, బూడిద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

పాలకుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్నూర్‌కు చెందిన పడాల వనితను జాతీయ బీసీ మహిళ సంక్షేమ సంఘం మండల అధ్యక్షురాలుగా నియమించారు. జిల్లా ప్రధానకార్యదర్శి బొద్దుల అరుణ నియామపత్రాన్ని అందించారు.

కాలుష్య నివారణకు తోడ్పడాలి

సుల్తానాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరూ తోడ్పడాలని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ రోజా అన్నారు. కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుని కాట్నపల్లిలో ఇటుకబట్టీల వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర వెంకటరెడ్డి,ఏఎన్ఎం కవిత,ఆశా లావణ్య తదతరులు పాల్గొన్నారు.

వసతిగృహాల సందర్శన

ఓదెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలోని బీసీ వసతిగృహంతో పాటు కస్తూర్బా పాఠశాల వసతిగృహాన్ని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. మాడల్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్, టీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, మ్యాడగొని శ్రీకాంత్, తీర్థాల కుమార్, బొంగోని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కాలనీలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తెలంగాణ చౌరస్తాలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, జక్కుల దామోదర్‌రావు, దుర్గాప్రసాద్, చక్రపాణి, మార్కరాజు, రాములు, సారయ్య నాయక్, అవినాష్, వీరారెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

సుల్తానాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ కోర్టులోని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు పండ్లు బిస్కట్లు పంపిణీ చేశారు. జడ్జి దుర్గం గణేష్‌తో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధానకార్యదర్శి జోగుల రమేష్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే విద్యా వనరుల కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో రాజయ్య బహుమతులు అందజేశారు. రత్నాకర్‌రెడ్డి, కరుణశ్రీ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో సురేంద్రకుమార్, సంధ్యారాణి, రజని, సిఆర్పీలు బాలసాని వెంకటేషం, ఎస్.శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీలత, సుధాకర్, శ్రావణ్‌కుమార్, రహీం, సంపత్ పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల విద్యావనరుల కేంద్రం లో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో సిరిమల్లే మహేష్, హెచ్ఎం సునీత, అత్తె రాజారాం, సుమలత, వనజ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో వెలుగులు నింపేలా చర్యలు

- రోడ్ల విస్తరణలో ఒక్కపేదవాడికి కూడా నష్టం జరగకుండా చూస్తాం.. - అర్బన్‌డేలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, చిత్రంలో మేయర్ అనిల్‌కుమార్ తదితరులు

కోల్‌సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి లేక రామగుండం చీకటిమయం అయ్యిందని, రామగుండంలో వెలుగులు నింపేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అర్బన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఏర్పాటు సమయంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం పొందుపర్చిన మూడు 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు, రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు కానున్నాయన్నారు. రూ.30 వేల కోట్లతో ఈ ప్రాజెక్టుల వల్ల వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అంతేకాకుండా స్వశక్తి సంఘాల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. రామగుండానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పాడుబడిన క్వార్టర్లను తొలగించి రూ.13కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తక్కువ అద్దెకు వ్యాపారులకు కేటాయించేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు ఓర్వలేక అడ్డు తగులుతున్నారన్నారు. రోడ్ల విస్తరణలో ఒక్క పేదవానికి కూడా నష్టం జరుగలేదన్నారు. మహిళలను బడా వ్యాపారులుగా తీర్చిదిద్దేందుకు బ్యాంకర్ల సహకారంతో సబ్సిడీ రుణాలను అందిస్తున్నామన్నారు. రామగుండంలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడమే కాకుండా 150కోట్లతో ఆసుపత్రి భవనాన్ని కూడా నిర్మిస్తున్నామన్నారు. నగరాభివృద్ధికి రూ.250కోట్లు తీసుకువచ్చామని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనిధి ద్వారా మంజూరైన రూ.1కోటి బ్యాంకు లింకేజీ, రూ.4.1కోట్ల చెక్కులను స్వశక్తి మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఉత్తమ పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. సిబ్బందికి వ్యక్తిగత రక్షణ కిట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా స్వశక్తి మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఎమ్మెల్యే, మేయర్ అనీల్ కుమార్ పరిశీలించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో మేయర్ అనీల్ కుమార్, మెప్మా డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ సతీష్‌బాబు, శ్రీనిధి రీజినల్ మేనేజర్ దుర్గా ప్రసాద్, మేనేజర్ రాజారావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఎస్ఈ శివానంద్, కార్పొరేటర్లు మహంకాలి స్వామి, కొలిపాక సుజాత, బొంతల రాజేష్, బాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బజార్ బంద్

- పట్టణంలో బైక్ ర్యాలీ - షాపుల మూసివేతను అడ్డుకున్న పోలీసులు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు

కోల్‌సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో రోడ్ల విస్తరణ, కూడళ్ల సుందీకరణ పేర షాపులను తొలగిస్తూ చిరు వ్యాపారులను రోడ్డు మీద పడవేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం గోదావరిఖని పట్టణంలో బీఆర్ఎస్ బంద్ పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో బంద్ పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు వ్యాపార వర్గాల నుంచి స్పందన రాలేదు. గోదావరిఖనిలోని బుక్కగులాల షాపులు మినహా మిగతా వారు షాపులు తెరిచారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సారధ్యంలో నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ షాపులు మూసివేయాల్సిందిగా వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోరుకంటి చందర్‌ను కూడా అదుపులోకి తీసుకుని తరువాత వదిలిపెట్టారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు బంద్‌కు సహకరించవద్దంటూ వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ రామగుండంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని, గాంధీ మార్కెట్‌ను కూల్చివేసి చిరు వ్యాపారులను రోడ్డున పడవేశారన్నారు. ఆరు గ్యారంటీలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని, రైతుబంధు ఎగ్గొట్టారన్నారు. ప్రజలను వంచించినందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. వెంటనే ప్రజలకు ఇచ్చిన నెరవేర్చాలన్నారు. ప్రత్యామ్నాలు చూపి నష్టపరిహారం చెల్లించిన తరువాతనే రోడ్ల విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. అచ్చె వేణు, బొబ్బిలి సతీష్, మారుతి, చల్లా రవీందర్‌రెడ్డి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, నట్టు శ్రీనివాస్, అరశనపల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, కుడుదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏడాది నుంచి సుపరిపాలన..

సుల్తానాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడ్డ ప్రభుత్వం రాష్ట్రంలో సుపరి పాలన అందిస్తోందని సుల్తానాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా సుల్తానాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ప్రజా పాలన సాధించిన వివరాలను వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, వార్డు అఫీసర్లు, ఆర్పీలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలో మంగళవారం నిర్వహించిన జ్ఞాన విజ్ఞాన మేళా ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి, లీడ్ ఇంచార్జీ ఐశ్వర్య హాజరై విద్యార్థుల సృజనాత్మకమైన ప్రయోగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని జిల్లా కేంద్రంలో నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు. మంగళవారం పెద్దపల్లి ఆర్యవైశ్య భవన్‌లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జిల్లా ఐక్య సంఘం అధ్యక్షుడు భీముజు సురేందర్ నాయకత్వంలో శ్రీకాంతాచారి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ, చెల్లోజు కవిత, మేడారం రాజ్యలక్ష్మి, నూతి లక్ష్మి, నాగులమల్యాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

● కళ్యాణ్‌నగర్ (ఆంధ్రజ్యోతి): శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు పెంట రాజేష్, మెతుకు దేవరాజు, నట్టు శ్రీనివాస్, రొడ్డ సంపత్, నూతి తిరుపతి, తోకల రమేష్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రజనీకాంత్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన బచ్చల రజనీకాంత్‌ను నియమించారు. మంగళవారం ఎంఆర్‌పీఎస్ నాయకుడు బ్రహ్మయ్య నియామక పత్రాలను అందజేశారు.

న్యాయవాదులను సన్మానించిన లయన్స్‌క్లబ్


న్యాయవాదులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్‌న్యాయవాదులు కొత్తకాపు సుధార్‌రెడ్డి, సంజయ్‌కుమార్, బల్మూరి అమరేందర్‌రావులను లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పీ మల్లికార్జున్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల కాలంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో న్యాయ సేవలు అందిస్తున్న వారిని అభినందించారు. జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ఎల్లప్ప, రాజేందర్, గంగాధర్, రామస్వామి, తిలక్ చక్రవర్తి, మనోజ్‌కుమార్, సారయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలిసారిగా జిల్లాకు సీఎం..

(3వ పేజీ తరువాయి)

2.45 కోట్ల రూపాయలు మంజూరుచేశారు. పెద్దపల్లి రూరల్, పెద్దపల్లి ట్రాఫిక్, మహిళా, ఎలిగేడు పోలీస్‌స్టేషన్లు మంజూరయ్యాయి. అంతకు ముందు జిల్లా గ్రంథాలయ భవనానికి 5 కోట్లు, మహిళా ప్రాంగణ భవనానికి 5 కోట్లు, మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజవర్గాల్లో న్యూఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల భవనాలకు నిధులు మంజూరుచేయగా, మంథని మండలం అడవి సోమన్‌పల్లిలో నిర్మించే భవనానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. మానేరు నదిపై ఓదెల మండలం రూప్‌నారాయణపేట్ వద్ద 80 కోట్లతో వంతెన నిర్మాణానికి 80 కోట్లు, పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాలను కలిపే పలు రోడ్లు, హుస్సేనిమియా వాగుపై జూలపల్లిలో వంతెన నిర్మాణానికి 80 కోట్లు మంజూరు చేశారు. వీటితో పాటు రామగుండం, మంథని నియోజకవర్గంలో చేపట్ట నున్న పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

● సభకు ఏర్పాట్లు పూర్తి..

రాజీవ్ రహదారిని ఆనుకుని రంగంపల్లి శివారులో నిర్వహించనున్న బహిరంగసభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. సభా వేదికపై వెనుకాల భారీ డిజిటల్ స్ర్కీన్‌తో పాటు, ఇరువైపులా మరో రెండు స్ర్కీన్లు, సభలో మరో రెండు స్ర్కీన్లను ఏర్పాటు చేశారు. ఇరువైపులా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం, గ్రూపు 4 ఉద్యోగుల కోసం, ప్రజలు వచ్చేందుకు మరో వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. 2 వేల మందితో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

● సాయంత్రం 4 గంటలకు సీఎం రాక..

యువ వికాసం బహిరంగసభకు సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు హైదరాబాద్ హెలిక్యాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు సభాస్థలికి చేరుకోను న్నారు. అక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను తిలకించనున్నారు. 4:30గంటలకు జ్యోతి ప్రజ్వ ళన చేసి తెలంగాణ రాష్ట్ర గీతంతో సభ ప్రారంభించనున్నారు, 4:35 నుంచి 4:55 గంటల వరకు వివిధ శాఖల మంత్రులు ప్రసంగించనున్నారు. ఆ తర్వాత 9007 మంది గ్రూపు 4, సింగరేణిలో ఉద్యోగాలు సాధించిన వారిలో 10 మంది నియామక పత్రాలను అందజేయనున్నారు. స్కిల్ యూనివర్శిటీకి సంబంధించి 7 ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. సీఎం కప్ పోటీల కప్ ఆవిష్కరించనున్నారు. 5:10 నుంచి 5:20 వరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క ప్రసంగించనున్నారు. అనంతరం 5:20 నుంచి 5:50 గంటల వరకు అరగంట సేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, పెద్దపల్లి ఎమ్మె ల్యే చింతకుంట విజయరమణారావు, అధికారులు పరిశీలించారు.

ఎస్సీ, ఎస్టీ యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- సీజీటీఎంఎంఎస్ఈ

అసిస్టెంట్ జీఎం మూర్తి..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అసిస్టెంట్ జీఎం మూర్తి

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతతో పాటు మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ పనిచేస్తుందని సీజీటీఎంఎస్ఈ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఆర్‌కే మూర్తి అన్నారు. క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ఠ్‌ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ప్రైజేస్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ సూచన మేరకు పట్టణంలో యువతకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మారుతున్న ఎస్సీ, ఎస్టీ యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనేక ఆర్థిక పరమైన స్కీంల వల్ల కలిగే లబ్ధిని ఆశావాహులకు వివరించారు. రుణం మంజూరీ కోసం విధి విధానాలను పరిశీలించిన తర్వాత ఐదు కోట్ల రూపాయాల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణం ఇప్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ లాయర్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు జూపాక వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట ప్రభుత్వం ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎస్.వి దశరథ్, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెంకటేష్, స్కిల్ ఇండియా ఎన్జీవో నిర్వాహకులు మస్తాన్‌ఖాన్, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, కార్పొరేటర్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు


రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన ఓదెల క్రీడాకారులు

ఓదెల, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓదెల, కనగర్తి, పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాక్సింగ్ టోర్నీలో రాష్ట్రస్థాయి పతకాలు సాధించారు. హన్మకొండలో మంగళవారం నిర్వహించిన 68వ, ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా బాక్సింగ్ పోటీల్లో తలపడిన కనగర్తి డిపిహెచ్ పాఠశాలకు చెందిన దొడ్డి కీర్తన, మోడల్ స్కూల్ కు చెందిన వేల్పుల అక్షిత, సోదరి వేల్పుల అక్షయ అండర్ 17 విభాగంలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ పతకాలను సాధించారు. రాష్ట్రస్థాయి పథకాలను సాధించిన ముగ్గురు విద్యార్థులను ఎంఈఓ రమేష్ అభినందించారు.

● సుల్తానాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలలో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి కళ్యాణ్ గుణాకర్ సత్తా చాటాడు. సోమవారం కామారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్14 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. కళ్యాణ్ గుణాకర్‌ను స్కూల్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు అభినందించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎలిగేడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మండిగ రాజనర్సు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, తాటిపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ ఓర్‌మ్యాన్ సత్యనారాయణ మృతి బాధాకరం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ


ఓర్‌మ్యాన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-2 పరిధిలోని 7ఎల్ఈపీ ఇసుక బంకర్‌లో పనులు పర్యవేక్షిస్తు న్న హెడ్ ఓర్‌మ్యాన్ తీట్ల సత్యనారాయణపై బంకర్ కూలి ఇసుకలో కూరు కుపోయి మృతిచెందడం బాధాకరమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్యనారాయణ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి ని తెలిపారు. సింగరేణిలో భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకోవాలని, కార్మికుల ప్రాణాలు విలువైనవని, వారి ప్రాణాలను కాపాడడం కోసం భద్రత చర్యలను పటిష్ఠం చేయాలన్నారు. సత్యనారాయణ కుటుంబాన్ని యాజమాన్యం అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం..

మందమర్రి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని ఆర్జీ-1లో మూసివేసిన 7ఎల్ఈపీ గనిలో మంగళవారం ఇసుక బంకర్ వద్ద పని చేస్తున్న హెడ్ ఓర్‌మ్యాన్ సత్యనారాయణ ప్రమాద మృతి బాధాకరమని, ఆయన కుటుంబా నికి అన్ని విధాలుగా తాము అండగా ఉంటామని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ప్రమాదంలో మృతిచెందిన ఓర్‌మ్యాన్ సత్యనారాయణ మృతదేహాన్ని ఆసుపత్రిలో పరిశీలించి విచారం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను పర్యవేక్షిస్తూ విధి నిర్వహణలో మృత్యువాత పడడడం వారి కుటుంబానికే కాకుండా సింగరేణికి తీరని లోటని, యాజమాన్యం కుటుంబానికి అండగా నిలవాలన్నారు. కంపెనీ బెనిఫిట్స్‌తో పాటు కుటుంబంలో ఒకరికి సూటబుల్ ఉద్యోగం ఇవ్వాలన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆర్జీ-2ను సందర్శించిన జీఎం సేఫ్టీ


ఓసీపీ-3ని పరిశీలిస్తున్న సేఫ్టీ జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాను మంగళవారం జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ సందర్శించారు. జీఎం వెంకటయ్యతో పాటు ముఖ్య అధికారులతో చింత శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓసీపీ-3ని సందర్శించి వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు అవసరాల దృష్ట్యా ఉత్పత్తి ఆటంకం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రోజు వారి లక్ష్యాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. వెంట ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు నరసింహారావు, రాజాజీ, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, ఎర్రన్న, భరత్‌కుమార్ ఉన్నారు.



దివ్యాంగుల అభ్యున్నతికి సింగరేణి సహకారం

- ఆర్‌జీ-1 సేవా అధ్యక్షురాలు అనితలలిత్‌కుమార్


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న సేవా అధ్యక్షురాలు అనితలలిత్‌కుమార్

గోదావరిఖని, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతికి సింగరేణి సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని ఆర్‌జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ అన్నారు. వర్కపీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జీఎంకాలనీలోని గోదావరి కళా ప్రాంగణంలో ప్రపంచ దివ్యాంగుల దినోవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా అనిత లలిత్‌కుమార్ హాజరై వేడుకలను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు దివ్యాంగులైన పిల్లలో ఉత్సాహాన్ని నింపడానికి, ప్రతిభపాటవాలు మెరుగుపర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మనో చైతన్య నిర్వాహకులు డి.కృష్ణకుమార్, డిజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, అధికారుల సంఘం ప్రతినిధి క్రాంతి, వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి బంగారు సారంగపాణి, సేవా కార్యదర్శి శిరీష చంద్రశేఖర్, లేడీస్ క్లబ్ కార్యదర్శి చిలుక లక్ష్మీ, మనోచైతన్య విద్యార్థులు, శిక్షకులు పాల్గొన్నారు.